నిరుపయోగంగా బాల్కొండ బస్టాండ్

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


బాల్కొండలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ భవనం

బాల్కొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ భవనం దశాబ్ద కాలంగా నిరుపయోగంగా మారింది. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ ఆధ్వర్యంలో 1991 సంవత్సరంలో బాల్కొండలోని జాతీయ రహదారి పక్కన బస్సులు నిలుపుటకు, ప్రయాణికులు సేదతీరుట కోసం బస్టాండ్ భవనాన్ని నిర్మించారు. 2007 వరకు అక్కడనే బస్సులు నిలపడంతో ప్రయాణికులు బస్టాండ్‌కు వెళ్లి రాకపోకలు కొనసాగించే వారు. 2007లో జాతీయ రహదారి రోడ్డు విస్తారణ పనులు చేపట్టారు. అందులో భాగంగా బాల్కొండ బస్టాండ్ వద్ద బైపాస్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో అప్పటి నుంచి బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. ప్రయాణికులు కూడ అక్కడ నిల్చోవడం లేదు. ఈక్రమంలో బస్సులు వెళ్లక, ప్రయాణికులు రాకపోవడంతో బస్టాండ్ భవనం నిరుపయోగంగా మారిపోయింది. దీనికితోడు మిషన్ భగీరథ ఓవర్ హెడ్‌ట్యాంక్ బాల్కొండ గుట్టపై నిర్మించారు. అక్కడికి వెళ్లుటకు సిమెంట్ రోడ్డు బస్టాండ్ భవనం ముందర నుంచి నిర్మించారు. దీంతో బస్సులు వెళ్లే అవకాశం లేకుండ పోయింది.

రోడ్డుపైనే ఎదురుచూపులు..

బాల్కొండ మండల కేంద్రంలో బస్టాండ్ భవనం నిరుపయోగంగా ఉండటంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే ఎదురు చూసే పరిస్థితి ఉంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించక ముందే బస్టాండ్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



బోధన్‌లో మాట్లాడుతున్న నందారెడ్డి.. బాల్కొండలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బోధన్: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని బీజేపీ బోధన్ సెగ్మెంట్ ప్రభారి నందారెడ్డి సూచించారు. పట్టణంలో ఆదివారం పార్టీ పట్టణ, మండలాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాబోయే రోజుల్లో తీసుకోబోయే కార్యక్రమాలపై వివరించారు. నాయకులు వడ్డె మోహన్‌రెడ్డి, జిల్లాకార్యదర్శి సుధాకర్‌చారి, శ్రీధర్, బాల్‌రాజ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి

మోర్తాడ్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీజేపీ బాల్కొండ నియోజకవర్గం పాలక్ రామారావు పటేల్, రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏర్గట్ల మండలం తడపాకల్‌లో ఆదివారం వారు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. సర్పంచ్ సోమ పెద్ద రాజారెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, కొండ ఘణశ్యాం, శ్రీనివాస్‌రెడ్డి, క్యాతం మహిపాల్, తోకల నర్సయ్య, గంగేశ్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఆదివారం పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. చేతి వృత్తుల కళాకారుల కోసం ప్రధానమంత్రి 'విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన' అనే పథకాన్ని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోహినూర్ మురళి, ఉపాధ్యక్షులు గంగాధర్, ప్రదాన కార్యదర్శి కిరణ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐలో కార్మికుల చేరిక



కోటగిరి: మండల కేంద్రంలోని పలువురు కార్మికులు ఆదివారం సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా దుబాస్ రాములు మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితులై కార్మికులు తమ వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. నాయకులు గంగాధర్, రాములు ఉన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



కోటగిరి: బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో కోటగిరి మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు గెలిచారని ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ సంజీవ్ కుమార్‌ను ప్రిన్సిపాల్ ముబీన్, కళాశాల సిబ్బంది అభినందించారు.

అథ్లెట్‌కు సన్మానం



బాల్కొండ: ముప్కాల్‌కు చెందిన శ్రీకాంత్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ మాస్టర్స్ గేమ్స్ 200 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించాడు. దీంతో ఆదివారం మండల కేంద్రంలో పూసల సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాస్, శ్రీధర్, పోశెట్టి, శ్యాం, చందు, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నలందలో 'కేసాట్' పరీక్ష



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలోని నలంద హైస్కూల్‌లో ఆదివారం విద్యార్థులకు హైదరాబాద్ ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో కలాం సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గణిత శాస్త్రంతో పాటు సైన్స్, రీజనింగ్, ఇంగ్లీష్ విభాగాల్లో పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకులు నలంద ప్రసాద్, సాగర్ తెలిపారు.

'డాడీస్ రోడ్‌యాప్' ప్రారంభం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ సురేష్‌బాబు 'డాడీస్ రోడ్‌యాప్'ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులకు ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం నిర్వాహకుడు రమేష్ మాట్లాడుతూ.. వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లే సమయంలో కానీ, ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు, అత్యవసర సమయాల్లో రక్తం అవసరం ఉన్నప్పుడు ఈ యాప్ బాగా పనిచేస్తుందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాసముందర్‌కు చెందిన గమ్మత్తు రత్నాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బాధిత కుటుంబాన్ని ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


విజేతకు కప్ అందజేస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్, సర్పంచ్ తదితరులు

బాల్కొండ: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వీపీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం విజేతలకు కప్‌తో పాటు నగదు అందజేశారు. సర్పంచ్ బూస సునీత, బీఆర్ఎస్ నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, ఉప సర్పంచ్ వాహబ్, షాహిద్, అన్వర్ పాల్గొన్నారు.

పెర్కిట్‌లో వైద్యశిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ మధుశేఖర్

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచితంగా సేవలందించడం వైద్య వృత్తిలో అంతర్భాగమన్నారు. శిబిరంలో 35 మంది వైద్యలు 2,400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రూ.4 లక్షల 50వేల మందులను ఉచితంగా అందజేశారు. 42మందికి శస్త్ర చికిత్సలు చేశారు. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, లింగారెడ్డి, వసంత కుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు బండారి ప్రసాద్, చేయూత స్వచ్ఛంద సభ్యులు పాల్గొన్నారు.


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

ధర్పల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కార్మికులకు ఈఎస్‌ఐతో పాటు జీవిత బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్మికులు నారాయణ, భోజన్న, రమేష్, విలాస్, గంగారం, లక్ష్మీ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికే మా మద్దతు

నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి తమ పూర్తి మద్దతు ఉంటుందని మండలకేంద్రంలోని మున్నూర్‌కాపు కులస్థులు తీర్మానం చేశారు. నందిపేట్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ.. మున్నూర్‌కాపు కులస్తులకు ఎమ్మెల్యే అండగా ఉన్నందున తామంతా ఆయనకు మద్దతు తెలుపుతున్నామన్నారు. సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్ తరలిన బీఆర్ఎస్ నేతలు



రెంజల్(బోధన్): మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే షకీల్‌కు మద్దతుగా నినాదాలు చేస్తు పార్టీ ఏర్పాటు చేసిన వాహనాల్లో బయలుదేరారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



వేల్పూర్: మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో మున్నూరుకాపు సంఘం భవనం నిర్మాణ పనులకు మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఎంపీపీ బీమజమున, వైస్ ఎంపీపీ సురేష్, నల్లరమేష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాయజ్ఞం



నవీపేట: మండల కేంద్రంలోని ధర్యాపూర్ హనుమాన్ ఆలయంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం యజ్ఞం నిర్వహించారు. ప్రకృతి వనరులను కాపాడేందుకు యజ్ఞం దోహదం చేస్తుందని ఆర్య సమాజ్ సభ్యులు పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కోటగిరి: కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అధిష్టానం అండగా నిలుస్తుందని పీసీసీ కార్యదర్శి తాహెర్ బీన్ హందాన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ ఆశయాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని శ్రేణులకు సూచించారు. ఎంపీటీసీ కొట్టం మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు షాహిద్, రాజేశ్వర్ పటేల్, అయ్యూబ్, వహీద్, సుంకిని హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు

బాల్కొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగాపూర్, బస్సాపూర్, బోదేపల్లి, ఇత్వారీపేట్, నాగాపూర్, ముప్కాల్ మండల కేంద్రంలో, మెండోరా మండలం సోన్‌పేట్, దూదిగాం గ్రామాల్లో ఆదివారం మల్లన్న స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు మల్లన్నకు నైవేద్యాలు సమర్పించారు. ముప్కాల్ మండల కేంద్రంలో శివశ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. మెండోరా మండలం దూదిగాంలో మల్లికార్జున్ స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగాణాల్లో అన్నదానాలు నిర్వహించారు.


నాగాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆధ్యాత్మికం..

బంగారు వెంకన్న రథోత్సవం..

ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో బంగారు వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


బాల్కొండలో సిడేను ఊరేగిస్తున్న భక్తులు


ముప్కాల్‌లో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు


మామిడిపల్లి గ్రామంలో..

✤ ఘనంగా సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం



కోటగిరి: పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలోని జగదాంబ మాత- సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఆదిలాబాద్ జిల్లా కొత్తపల్లి పీఠాధిపతి, దీక్ష గురువు సద్గురు ప్రేమ్ సింగ్ మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీరి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం జరిగాయి.

✤ వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుట్టపై ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

✤ ఘనంగా మల్లన్న స్వామి జాతర

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముజెగ మల్లన్న జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది.

స్వర్ణామృత ప్రాశనం పంపిణీ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలో ఆదివారం 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ స్వర్ణామృత ప్రాశనాన్ని పంపిణీ చేశారు. ఈ స్వర్ణామృతం చిన్న పిల్లల మెదడు ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. అలాగే మతిమరుపు, బుద్ధిమాంద్యం, చదువుపై శ్రద్ధలేకపోవడం లాంటి సమస్యలను తొలగిస్తుందని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని డాక్టర్ విజయభాస్కర్ తెలిపారు. ఆశ్రమ కమిటీ సభ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి


మోర్తాడ్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు

మోర్తాడ్: మండల కేంద్రంలో సంత్ రవిదాస్ జయంతిని ఆదివారం దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నాయకులు మల్లూరి రాజారాం, మామిడి గంగాధర్, మామిడి రవి, జాంభవ చమర్ పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం సంత్ సద్గురు రవిదాస్ జయంతిని రాకాసీపేట్ మోచి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం నాయకులు సతీష్‌కుమార్, లింగేష్, రాజు, లింగన్న, పెద్ద నర్సింలు, రామాకృష్ణ, సింగయ్య ఉన్నారు.

సమాచారం..

బాబాపూర్‌లో నేడు ఉర్సు ప్రారంభం

భీమ్‌గల్: మండలంలోని బాబాపూర్ గ్రామంలో బాబా(బావయ్య) గుట్టపై నేటి నుంచి ఉర్సు ప్రారంభం కానుంది. మూడురోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు మండల ప్రజలే కాకుండా బోధన్, నిజామాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకుడు ముత్తవలి సిగ్బతుల్లా తెలిపారు.

నూతన కార్యవర్గం..

ముదిరాజ్ సంఘం..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాంనగర్‌లో ఆదివారం పట్టణ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జక్కం గంగాధర్, ఉపాధ్యక్షుడిగా సాంబడి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా జంగిడి భోజన్న, కోశాధికారిగా జంగిడి సురేష్, కార్యవర్గ సభ్యులుగా ఈర్ల రవి, శీల శ్రీకాంత్, జంగిడి పెద్ద భోజన్నలు ఎన్నికైయ్యారు. కులసభ్యులు నూతన కార్యవర్గంను పూలమాలతో సత్కారించారు.

ఆర్మూర్ మండల పీఎంపీ అసోసియేషన్..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీలోగల పీఎంపీ భవన్‌లో ఆదివారం ఆర్మూర్ మండల పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా రంజిత్, కార్యదర్శిగా శ్రీనివాస్, ట్రెజరర్‌గా నరేందర్, జాయింట్ సెక్రెటరీగా నరేందర్, సంయుక్త కార్యదర్శిగా తిరుపతి, సలహాదారుడిగా హరిచరణ్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షుడు పుల్కన్ మోహన్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి


నిరసన దీక్షలో పాల్గొన్న గౌడ సంఘ నాయకులు

మోర్తాడ్: మోర్తాడ్‌లో సర్వాయి పాపన్న విగ్రహాన్ని తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ డిమాండ్ చేశారు. మోర్తాడ్‌లో నిరసన దీక్షలను కొనసాగిస్తున్న గౌడ సంఘం సభ్యులకు ఆదివారం ఆయన మద్దతు తెలిపి, విలేకరులతో మాట్లాడారు. వెంటనే విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. గౌడ సంఘ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.